నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

ఆదివారం
01 సెప్టెంబరు
2024
పేజీలు 8

గుంటూరు
పల్నాడు

# రేపు ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం




- ముఖ్య అతిథిగా పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాలక్రిష్ణన్
- గౌరవ అతిథిగా 'స్విగ్గీ' సీఈవో రోహిత్ కపూర్
- 1018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- 28 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

**మంగళగిరి మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యాప్రమాణాలను అందిస్తోన్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సెప్టెంబరు 2న మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ఆవరణలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియమ్ లో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆక్సిల్లర్ వెంచర్స్ ఛైర్మన్ మరియు ఇన్ఫోసిస్ కో ఫౌండర్ పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాల క్రిష్ణన్, గౌరవ అతిథిగా ప్రఖ్యాత స్విగ్గీ ఫుడ్ మార్కెట్ సీఈవో రోహిత్ కపూర్ లు విచ్చేస్తున్నారు. వీరితో పాటు యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ స్నాతకోత్సవంలో పాల్గొంటున్నారు.

### 1018 మందికి డిగ్రీలు ప్రదానం

4వ స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ మొత్తం 1018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుంది. వీరిలో ప్రతిభ కనబరిచిన 28 మంది బంగారు, వెండి, కాంస్య పతకాలను అందుకోనున్నారు. 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఐదుగురికి వెండి, మరో ఐదుగురికి కాంస్య పతకాలను ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా 24 మంది పీహెచ్ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజినీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ. 29 మంది బీబీఏ, ముగ్గురు బీకాం చదువులు పూర్తి చేసుకుని డిగ్రీలు అందుకోనున్నారు. వీరితో పాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు.

### బోధన, పరిశోధనే లక్ష్యంగా

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కేంద్రంగా 2017 జులైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రారంభమైంది. ప్రస్తుతం 9 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, సైన్స్, లిబరల్ ఆర్ట్స్ అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు మాత్రమే కాకుండా 350 మంది పీహెచ్ విద్యార్థులు ఉన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యాపరంగా ఎంతో అభివృద్ధిని సాధించింది. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రయివేటు యూనివర్సిటీగా పేరు గడించింది. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న యూనివర్సిటీలకు ధీటుగా ఇంజినీరింగ్ విద్యను అందిస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధిస్తోంది. ఏటా 80 శాతం విద్యార్థులు వివిధ పేరున్న కంపెనీలలో సాఫ్ట్వేర్ ఉద్యోగులుగా ఎంపికవుతున్నారు. మిగతా వారంతా ఉన్నత చదువుల నిమిత్తం విదేశీ యూనివర్సిటీల్లో జాయిన్ అవుతున్నారు. బోధనతో పాటు పరిశోధనలకు యాజమాన్యం పెద్దపీట వేయడంతో ఇక్కడి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పరంగా రీసెర్చ్ ప్రాజెక్టులు కూడా లభ్యమవుతున్నాయి. యూనివర్సిటీలో బోధన చేస్తోన్న అధ్యాపకులందరూ అంతర్జాతీయ స్థాయిలో పేరున్న యూనివర్సిటీల్లో పీహెచ్ఎ చేసిన వారే కావడం విశేషం. కాగా రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్కుమార్ ఆధ్వర్యంలో డీన్లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్సింగ్, పంకజ్, అనిల్ నిగమ్, ఫెర్నాండేజ్, రేవతీలు స్నాతకోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## రూరల్ ఎంప్లాయిమెంట్తో గ్రామాభివృద్ధి

- విద్యార్థులు గ్రామాల్లో రీసెర్చ్ చేయాలి
- ఐ ఎస్ ఎఫ్ అంకుర యాత్ర ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న.కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** "కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు రూరల్ గ్రామాల్లోని రైతుల సమస్యలు, క్రిమి కీటకాల నివారణ వంటి అంశాలపై రీసెర్చ్ చేయాలి. రూరల్ ఎంప్లాయిమెంట్ క్రియేట్ చేయగలితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. చంద్రబాబు వంటి విజన్ ఉన్న నాయకుడు ఉన్నప్పుడే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు రాగలరు." అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ (ISF) వారి అంకుర యాత్ర ప్రారంభ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెమ్మసాని గారు మాట్లాడుతూ స్టార్ట్ అప్ ఎకో సిస్టం ద్వారా దీర్ఘకాలంలో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, కాలిఫోర్నియా మాదిరిగా ఏపీలోనూ స్టార్టప్ లు తీసుకొచ్చేందుకు ISF ప్రయత్నం చేస్తోందని చెప్పారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ వారు ఏపీకి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్వయం సహాయక సంఘాల్లోని సుమారు 10 కోట్ల మంది చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నారని

మిగతా 3లో..

## ముసురులో ఉమ్మడి గుంటూరు జిల్లా

- అల్పపీడన ప్రభావంతో దంచి కొట్టిన వాన
- పొంగిపొర్లిన వాగులు, చెరువులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు
- కొట్టుకుపోయిన కారు.. ముగ్గురు దుర్మరణం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జోరు వాన కురిసింది. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల రహదారులపైకి వర్షం నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉప్పలపాడు కాలువలో పడి నలుగురు చనిపోయారు. వాగులు, చెరువులు పొంగి బ్రిడ్జిల పైన ప్రవహించాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ డిపోల్లో మోకాల్లోతు నీళ్లు చేరాయి. లోతట్టు ప్రాంతాలు జలమలం అయ్యాయి. పలు ప్రాంతాల్లో కాలువల్లోని నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరింది. దీంతో విపరీతమైన దుర్గంధంతో పాటు దోమలు వచ్చి చేరాయి. చాలా ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణలతో నీరు రహదారులపై చేరింది. దీంతో



పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల్లో కూడా వేసిన పంట వర్షం కారణంగాచాలా నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ముగ్గురు దుర్మరణం..** గుంటూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. నంబూరులోని ఓ పాఠశాలలో ఉప్పలపాడుకు చెందిన రాఘవేంద్ర విధులు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం సెలవు ప్రకటించింది. దీంతో అదే పాఠశాలకు వెళ్లిన ఉప్పలపాడుకు చెందిన ఇద్దరు

మిగతా 3లో..

## ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బాధితులకు సాయం :



**తెనాలి మేజర్ న్యూస్ :** ఎడతెరుపి లేకుండా భారీగా వర్షాలు కురు స్తున్న నేపథ్యంలో శనివారం ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు రావూరి అంజలి కొలకలూరులోని నిరుపేద గిరిజనులకు బియ్యం పంపిణి చేశారు. రైల్వే స్టేషన్, కాలువకట్టలపైన నివసిస్తున్న ఆయా కుటుంబాలకు తాత్కాలిక వసతికోసం ప్లాస్టిక్ పట్టాలను అందించినట్లు ఆమె తెలియజేశారు.కాగా నందివెలుగు కాలువకట్టపై నిర్వాసితులైన 12 కుటుంబాలకు ఆహారపొట్లాలను అందించామని అంజలి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంటూరి విజయ భాస్కర్,రాయుడు పాల్గొన్నారు.

## భారీ వర్షం లో పింఛన్ ల పంపిణీ:



**తెనాలి టౌన్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుండటం అందులో తెనాలిలో కూడ వర్షంలో సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం నుంచే లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నారు. ఈసారి సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెనాలిలో భారీ వర్షంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పెన్షన్ పంపిణీ కోసం పలు ప్రాంతాలలో హాజరైనారు. ఆయన అజమాయషీ ఉండటంతో నియోజక వర్గంలో భారీవర్షం ఉన్నా సిబ్బంది పింఛన్ల పంపిణీ ముమ్మరంగా సాగుతుంది.

## మంగళగిరిలో భారీ వర్షాలపై గంట గంటకు మంత్రి లోకేష్ సమీక్ష

**మంగళగిరి మేజర్ న్యూస్:** మంగళ గిరి నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఎప్పటికపుడు అధికారులతో పరిస్థితిని సమీక్షిస్తు న్నారు. టిడిపి కార్యాలయ కంట్రోల్ రూమ్ ద్వారా గంటగంటకు పరిస్థితులను వాకబు చేస్తూ సహాయ చర్యలపై అధికారులకు సూచనలు ఇస్తున్నారు. వరద ముంపునకు గురైన రత్నాల చెరువు ప్రాంత వాసులకు తక్షణమే సహాయం అందించాలని ఆదేశించారు. భారీవర్షం కారణంగా బ్లాక్ అయిన రోడ్లను వెంటనే క్లియర్ చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిందిగా సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా కు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు అందిస్తూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా పార్టీ శ్రేణులను కోరారు. తుపాను తీవ్రరూపం దాల్చుతున్నందున అధికారులంతా 24/7 అందుబాటులో ఉండాలని, అవసరాన్ని బట్టి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## జోరు వానలో పెన్షన్లు పంపిణీ



**తెనాలి టౌన్ న్యూస్:** ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం వచ్చే నెల సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం కావడం తో ఒకరోజు ముందుగానే పంపిణీ చేపట్టిన 23వ వార్డు జనసేన. నాయకులు వీర మహిళలు. భారీ వర్షంలో కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లో, అవ్వ తాతలకు, వికలాంగులకు, వితంతువులకు, పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని, దిగ్విజయంగా పూర్తి చేసిన 23 వ వార్డు జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు.

## పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు సత్కారం



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేస్తున్న 4 గురు పోలీసు అధికారులకు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర రావు, ఎఆర్ డి ఎస్ పి శాంత కుమార్ ఆత్మీయ ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఈరోజు రిటైర్డ్ అవుతున్న పోలీసు అధికారులు వారి శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని కోరారు. మీరు పోలీసు డిపార్ట్మెంట్ లో చేసిన సేవలు చిరస్మరణీయం అని పేర్కొన్నారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. వ్యాయామం, పుస్తక పఠనం చేయాలని సూచించారు. పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు వారి కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో జ్ఞాపికతో మరియు పూలమాలలతో సత్కరించి, వారి సేవలను కొనియాడి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. పదవి విరమణ చేసిన వారిలో ఎస్సైలు శ్రీరామ నారాయణమూర్తి, ఎ. రవీందర్ రాజు, ఏ.ఎస్.ఐ దేవ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణమూర్తి వున్నారు.

# వర్షాలకు అప్రమత్తంగా ఉండండి: ప్రాథమికవైద్యం అవసరం: డాక్టర్. సుబ్బారావు



**తెనాలి మేజర్ న్యూస్:** కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వ్యాధులు సోక కుండాప్రాథమిక వైద్యం అందుకునిఎప్పటికప్పుడు ఆరోగ్య సూత్రాలను పాటించాలని కొలకలూరు ప్రాథమిక వైద్య అధికారి. డాక్టర్.సి.హెచ్..సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులఆదేశాల మేరకు తెనాలిమండల పరిధిలోని ఉన్నటువంటి నందివెలుగు కంచర్లపాలెం అప్ పేట కాజీపేట కటెవరం గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రతి ఒక్కరు వేడినీళ్లుత్రాగి జలుబు, దగ్గు సోకినవారు పసుపునీరు ఆవిరి పట్టాలని గ్రామాలలో ఉన్నటువంటి ఏ.ఎన్.ఎం.లు ఎం.ఎల్.హెచ్. పి. లు ఆశా వర్కర్లు సర్వేలు నిర్వహించి ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి ఎం ఎల్ హెచ్ పి సబ్ సెంటర్ ద్వారా మందులను పంపిణీ చేయాలని ఎప్పటికప్పుడు ప్రజలకు ఆరోగ్య సూత్రాలనువివరిస్తూ వారికి కావలసిన మందులునందిస్తూ, వైద్య పరీక్షలునిర్వహించాలని వారుతెలిపారు ప్రాథమిక వైద్యశాలకు చికిత్స నిమిత్తం అన్ని వేళల అందుబాటులో ఉంటామని ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యశాలకు సమాచారం ఇచ్చి వైద్యాన్ని ప్రజలకు అందించి ఎటువంటి అనారోగ్యం సోకినా మా దృష్టికి తీసుకురావాలని తనంతరం ప్రభుత్వ పెద్దాసుపత్రికి పంపిస్తామని వారు తెలిపారు అవసరమైతే మండల గ్రామీణ ప్రాంతాలలో సబ్ సెంటర్ల ద్వారా మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని ఎం ఎల్ హెచ్ పి ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ప్రజలకు అవసరమైన మందులను పంపిణీ చేసి వ్యాధులను నిరోధించాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వ్యాధులు ప్రభావితం కాకుండా తగు చర్యలు తీసుకుని ఆయా గ్రామాలలో పంచాయతీ ఈవోలను కూడా మీరు సంప్రదించి ప్రజలకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు

## ఘనంగా శ్రీ సీతారామస్వామి, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు



**పొన్నూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో హనుమత్ సీతా లక్ష్మణ గణపతి సుబ్రహ్మణ్య సహిత శ్రీరామచంద్రమూర్తి మరియు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవము శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. . ఈ కార్యక్రమమునందు గోపూజ నిత్య విధి గర్త న్యాసము, రత్నం న్యాసము, యంత్రబింబ ప్రతిష్ట అష్ట బంధనము కళాభ్యాసము దర్శన ద్రవ్యము పూర్ణాహుతి కుంభాభిషేకము మహాదాసి శాంతి కళ్యాణము కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వడ్లమూడి సంగమేశ్వర దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భాగంగా గత రెండు రోజులుగా గణేష పూజ ,పుణ్యాహ ము, గవ్యాధి ప్రోక్షణము దీక్ష రుత్వి కరణము, గోపూజ, యంత్ర బింబ సంస్కార తీర్థ ప్రసాద వినియోగము ,అఖండ స్థాపన, ముత్యం గ్రహణ అంకురారోపణము ,అగ్ని ప్రతిష్ట, ఉత్త హెూమములు, జలాధివాసము, గోపూజ, నిత్య విధి ,మహా శాంతి ,విశేష ద్రవ్య స్నాపము, ధాన్యాధివాసము, అది వాసాంగ హెూమము ,తీర్థ ప్రసాద వినియోగము ,నిత్య విధి, శాలార్చన మండపారాధనము, స్థిరాహుతి, స్మర్నాహుతి పూర్వక కళ హెూమములునిర్వహించడం. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## గుంటూరు కార్పొరేషన్ వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీటిలో ఎన్ ఎస్ యు ఐ పడవ ప్రయాణం..



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిలువునా ఎండ కట్టారు NSUI గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీం.. గత వారం రోజులుగా భారీ వర్షం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపినప్పటికీ గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూశారు.. ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు.. డ్రైనేజీలలో పూడికతీత వంటి పనులు ఏ మాత్రం చేపట్టలేదు.. దీంతో వర్షపు నీటితో నిండిపోయిన డ్రైనేజీ, సైడు కాలువలోని నీరు రోడ్లపైకి భారీగా చేరింది.. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగమైన NSUI జిల్లా అధ్యక్షులు షేక్ కరీం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెరువును తలపిస్తున్న వర్షపు నీటిలో పడవ ప్రయాణం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.. ఎం ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం చేపట్టిన వినూత్న నిరసనకు అటుగా పయనించే వాహనదారులు మద్దతు పలికారు.. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మొద్దు నిద్ర వీడి, కళ్ళు తెరిచి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.. భారీ వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు నిలవకుండా ముందుకు వెళ్లే విధంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వేడుకుంటున్నారు.

## ఆరోగ్య సంరక్షణ పై దృష్టి సారించాలి: ఎస్పీ



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించా లని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. గుంటూరు పట్టణం నాజ్ సెంటర్ ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ సహకారం తో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. నాజ్ సెంటర్ లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ లో పోలీస్ సిబ్బందికి మెగా ఉచిత మెడికల్ క్యాంపు నందు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపు శిబిరానికి గుంటూరు జిల్లా ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం గురించి ఆంధ్రప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ డేగల ప్రభాకర్ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే ధ్యయయంగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ కు డాక్టర్ల బృందానికి ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు ఉచిత వైద్య సేవలు అందించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం మరియు సమాజం బాగుంటుందని ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల విభాగాలకు చెందిన వైద్యులు పోలీస్ అధికారులు, సిబ్బందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన ఆలపాటి



**తెనాలి టౌన్ న్యూస్:** సెప్టెంబర్ నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను, ప్రభుత్వ ఆదేశానుసారం, ఒకటవ తేదీ ఆదివారం కావడం చేత, ఒకరోజు ముందుగా శనివారం, పెన్షన్లను పంపిణీ చేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉదయం నుండి. మండల గ్రామాలైన సామచంద్రపాలెం కంచర్లపాలెం చక్రాయపాలెం. గ్రామాలతో పాటుగా పట్టణంలోని 19,20, 36 వార్డుల యందు, అవ్వ తాతలకు దివ్యాంగులకు వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజా తో పాటుగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పలువురు కౌన్సిలర్లు మరియు తెలుగుదేశం నాయకులు. కార్యకర్తలుపాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలను సంరక్షించండి

## అధికారులకు ఆదేశించిన: ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు నగరంలో లోతట్టు ప్రాంతాలు ఈరోజు కురుస్తున్న భారీ వర్షాలకు వీధులన్నీ మునిగిపోయి ఇళ్లల్లోకి నీరు చేరడంతో వారి సంరక్షణకై ఆ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. నిన్నటి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గడ్డిపాడు చెరువు నిండి వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుతుందని ఆటోనగర్, మద్దిరాల కాలనీ,బసవ తారక్ నగర్, పాత గుంటూరు, ప్రాంతాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా వర్షంలో తిరుగుతూ పరిశీలించి వారికి తగు సూచనలతో అప్రమత్తం చేశారు. గత ప్రభుత్వం డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి వాగులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన నీరు పోయే దారి వీల్ లేక రోడ్ల ఇళ్లల్లోకి నీరు చేరుతుందని ప్రధానంగా రైల్వే మొండికేట్ వద్ద డ్రైనేజీ వెంట్ ను తక్షణమే నిర్మాణం చేపట్టినైతే ఇటువంటి అధిక వర్షాల వల్ల వచ్చిన నీరు కానీ డ్రైనేజ్ నీరు గాని సులభంగా పోవడానికి ఉపయోగపడుతుందని అధికారులు మొండి గేట్ వెంట్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. అలాగే ప్రజలు కురుస్తున్న వర్షాలకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇళ్లలో నుండి బయటికి రావద్దని,ప్రజలను కోరారు. అలాగే వాతావరణ మార్పు వల్ల



సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు అప్రమత్తమై వేడి పదార్థాలు తినడం, గోరువెచ్చని నీరు తాగాలని కోరారు. అలాగే అధికారులతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో లో డ్రైనేజ్ వ్యవస్థకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు వీలైనంత త్వరలో తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఇంతటి వర్షంలో కూడా తమ పట్ల బాధ్యతతో తమ ఏరియాలలో సందర్శించిన ఎమ్మెల్యే నసీర్ కు ఆయా ప్రాంత ప్రజలు అభినందించారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎంటిఎంసి కమిషనర్, తహాశీల్దార్



**మంగళగిరి, మేజర్ న్యూస్:** గత రెండు రోజుల కురుస్తున్న వర్షం కారణంగా శనివారం వరద ప్రవాహం మంగళగిరి జనజీవానని స్దంభింపచేసింది. కొండ ప్రాంతం నుండి వచ్చిన వరద నీరు ఒక్క సారి పెరగటంతో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పట్టణ పుర వీధులు జలసాంద్రంగా మారాయి. గౌతమ బుద్దరోడ్డు, జాతీయ రహదారులపై వర్షపు నీరు రెండు ఆడుగుల మేర ప్రవహించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడిక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. విద్యాసంస్థలుకు సెలవులు ప్రకటించారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్ద కమిషనర్ ఆలీమ్ బాషా, మంగళగిరి తహాశీల్దార్ సుబానీ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలలో రక్షనాత్మక చర్యలు చేపట్టారు. మంగళగిరి టిడ్కో నివాసాల వద్ద వరద నీరు నిలిచిపోవటంతో కార్పొరేషన్ కమిషనర్ ఆలీమ్ బాషా యుద్దప్రతిపాదికన చర్యలు చేపట్టారు. ప్రోక్లైనర్ తో కాలువ తీయించి వరద నీరు మళ్లించారు. ఆత్మకూరు గుంటూరు కాలువకు గండి పడటంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం 80 కుటుంబాలను జెడ్పి పాఠశాలకు తరలించి పునరావస చర్యలను చేపట్టారు. టిడిపి శ్రేణులు నారా లోకేష్ ఆదేశాల మేరకు నిర్వాసితులకు ఆహారం పంపిణీ చేశారు. నిడమర్రు చెరువు వద్ద ప్రోక్లైనర్ తో కాలువ తీయించి నీటి ప్రవాహంను మళ్లించారు. నవులూరు పోతురాజు చెరువు వద్ద నీరు పోలాలలోకి మళ్లించి నీటి ఉధృతిని తగ్గించారు. యర్రబాలెం చెరువు నిండిపోయి రాజధాని రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. మంగళగిరి రూరల్ పోలీసులు, కార్పొరేషన్ ఆధికారులు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై రక్షణాత్మక చర్యలు చేపట్టారు. వరద ప్రవహం ఉన్న ప్రాంతాలో సిబ్బంది విధులకు కేటాయించారు.

# రూరల్ ఎంప్లాయిమెంట్‌తో గ్రామాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. వీరిలో కొందరు రూ.20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు కూడా సంపాదిస్తున్నారని, ఇలాంటి వారికి సహకారం అందించాలని సూచించారు.
వ్యాపారానికి వయసుతో సంబంధం లేదు వ్యాపార రంగంలో అడుగు పెట్టాలనుకునే వారికి వయసుతో సంబంధం లేదని, తాను విద్యార్థిగా ఉంటూనే వ్యాపార రంగంలోకి అడుగు పెట్టానని పెమ్మసాని వివరించారు. తొలుత 20-30 మంది విద్యార్థులకు బోధించానని, అమెరికా అంతటా తన మెటీరియల్ చదవాలనే లక్ష్యంతో పని చేశానని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కూడా ఇదే లక్ష్యంతో పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాలని సూచించారు. ఇతర దేశాల్లో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలను కూడా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. త్వరలో mygunturmp.in 'ప్రజల కోసం త్వరలో mygunturmp.in పోర్టల్ ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ప్రాజెక్టుల గురించి తెలియజేస్తే ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తాం' అని పెమ్మసాని అన్నారు. అనంతరం అంకుర యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ISF ఛైర్మన్, ఫౌండర్ డాక్టర్ జేపీ చౌదరి, కేఎల్ వర్సిటీ ఛైర్మన్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ, ISF కో-ఫౌండర్లు దీనానంద్, సత్యేంద్ర, శివమహేష్, శ్రీకాంత్, కేజీఎంజీ మేనేజింగ్ పార్టనర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# జోరు వానలో పెదకాకానిలో పింఛన్ల పంపిణీ

**పెదకాకాని, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న జోరు వానను కూడా లెక్కచేయకుండా పెదకాకాని మండలం పెదకాకాని గ్రామంలో శనివారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామంలోని నాయకులు సంయుక్తంగా కలిసి లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగా ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందిని పింఛన్ లబ్ధిదారులు అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుప్పాల సాంబయ్య షేక్ రెహమానతోపాటు తెలుగుదేశం పార్టీ జనసేన నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పుప్పాల సాంబశివరావు మాట్లాడుతూ సంక్షేమానికి కట్టుబడి ఉన్న తెలుగుదేశం పార్టీ పెన్షన్లను ఒకటో తారీకు ముందు ఒక రోజే పంపిణీ చేయడంతో తన నిబద్ధత చాటుకుందని అన్నారు భవిష్యత్తులో కూడా వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ఎలాంటి సమస్య లేకుండా పెన్షన్లు అందించడం జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు.



# మూడు వారాల్లో పరిష్కరిస్తాం

## పోస్టల్ జీడీఎస్ ఎంప్లాయిస్ ఉద్యోగోన్నతిపై పెమ్మసాని హామీ



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** పోస్టల్ శాఖలో జీడీఎస్(గ్రామీణ డాక్ సేవక్) ఎంప్లాయిస్ ఉద్యోగోన్నతి సమస్యను మూడు వారాల్లో పరిష్కరిస్తామని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర పెమ్మసాని చంద్రశేఖర్ గారు హామీ ఇచ్చారు. పులివెందుల నుంచి వచ్చిన పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు గుంటూరులోని స్థానిక ఎంపీ కార్యాలయంలో పెమ్మసాని గారిని శనివారం కలిసి తమ సమస్యను వివరించారు. పోస్టల్ శాఖలో గ్రామీణ డాక్ సేవక్ లుగా పని చేస్తూ ఉద్యోగోన్నతి కోసం 2022 మరియు2023 సంవత్సరాల్లో 2 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాశారని, అయితే ఏపీలో ఖాళీలు లేనందున తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని తెలిపారు. ఢిల్లీలో 3600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు 11 నెలల క్రితం వినతిపత్రం అందించామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పెమ్మసాని గారి దృష్టికి ఈ సందర్భంగా తీసుకొచ్చారు. సమస్యపై పెమ్మసాని గారు స్పందిస్తూ ఢిల్లీ అధికారులతో చర్చించి మూడు వారాల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# సార్డ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయం ప్రారంభం




**తెనాలి మేజర్ న్యూస్ :** పేద, బడుగు, బలహీన విద్యార్థుల అభ్యున్నతికి సార్డ్ సంస్థ నిరంతరం కృషిచేస్తుందని సంస్థ డైరెక్టర్ అందే శ్యామ్ అన్నారు. సార్డ్(సోషల్ యాక్షన్ అండ్ రూరల్ డెవలప్మెంట్) ఆధ్వర్యం లో స్థానిక ఐతానగర్ హయ్యర్ పేటలో శనివారం నూతన కార్యాలయాన్ని ప్రారంభిం చారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, అనాధలు, వితంతు మహిళలతో పాటు చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాలకు అవసరమైన జామెంట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిల్లు, పుస్తకాలు అందజేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్ అందె శ్యామ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి విద్యను అందించడం, వృద్ధులను ఆదుకోవడం, గ్రామాల్లో కావాల్సిన మౌళికవసతుల కల్పనకు ప్రభుత్వంపై వత్తిడి తేవడమే సార్డ్ ముఖ్యోద్దేసమని అన్నారు. రూరల్ గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహణ, విద్యార్థుల అభ్యున్నతికి సెమినార్లు నిర్వహించడం, ముఖ్యంగా రాజ్యాంగంపట్ల అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరచడమే సంస్థ ప్రధాన అజెండా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు ద్వారా యువతను మేల్కొలిపే దశగా సంస్థ కార్యాచరణ ఉంటుందని సార్డ్ జాతీయ అధ్యక్షుడు యంఎస్ డేవిడ్ రాజు అన్నారు. కార్యక్రమంలో సుమారు వందమందికి పైగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరసా సుజన్ రాజు, వి శేషు, జె రమేష్,మహర్షి, దైవ వర్ధమానికులుకె.ఇమ్మానియేలు పాల్గొన్నారు.

# ముసురులో ఉమ్మడి గుంటూరు జిల్లా

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులను తీసుకొని రాఘవేంద్ర స్వగ్రామానికి బయల్దేరాడు. మురుగు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నా ఆగకుండా వెళ్లడంతో వరద ఉధృతికి కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో రాఘవేంద్రతోపాటు కారులో ఉన్న విద్యార్థులు సాత్విక్, మానిక్‌లు మృతిచెందారు. స్థానికుల సాయంతో కారు తో పాటు వాగులో కొట్టుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు.

# వర్షంతో కాలనీలు జలమయం



**తెనాలి టౌన్ న్యూస్:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు వీధులు, శివారు కాలనీలు జలసంద్రమైనవి. స్థానిక బోస్ రోడ్డు,బుర్రిపాలెం రోడ్డు, ఎమ్మార్వో కార్యాలయం, ఆర్డిఓ కార్యాలయం. రామలింగేశ్వరపేట ప్రధాన రహదారి, అన్నియు జలమ యమయ్యాయి. అలాగే మారిస్ పేట లోని 23వ వార్డులో గల చంద్రబాబునాయుడు కాలనీ యందు, సాంఘిక సంక్షేమ హాస్టల్ రోడ్డు తో పాటుగా, పలు ఇళ్లు వర్షపు నీటిలో మునిగిపోయాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం నందు ఉదయం నుండి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. పురపాలక సంఘ హెల్త్ ఆఫీసర్ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్, సంబంధిత కాలనీని సందర్శించి. వర్షపు నీటిని తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది మరియు. జన సైనికులు వీర మహిళల సహకారంతో. తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# మంగళగిరి జాతీయ రహదారిపై వరద ఉధృతి



**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి ప్రాంతంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షం ప్రభావంతో వరద నీరు పోటెత్తింది. మంగళగిరి పట్టణం జలదిగ్బందం కావటంతో పాటు రోడ్లపై బారీగా వరద నీరు చేరకుంది. ఉదయం 9 గంటల నుండి మంగళగిరి కాజా టోల్ గేట్ వద్ద వర్షపు నీరు పారటంతో జాతీయ రహదారిని స్తంభింపచేసింది. 3 ఆడుగుల మేర రోడ్లపై వరద నీరు ప్రవహించటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు టోల్ గేట్ వద్ద సిబ్బందితో కలసి రక్షణాత్మక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి. సర్వీసు రోడ్లపైకి ప్రజలను అప్రమత్తం చేయటంతో పాటు ప్రమాదకర పరిస్దితులను సామాజిక మాధ్యమాల ద్వార ఎస్ఐ తెలియచేశారు. రూరల్ సిఐ వై శ్రీనివాసరావు టోల్ టాక్స్ వసూలు చేయకుండానే ఉన్న వాహనాలను ముందుకు పంపించే చర్యలు టోల్ గేట్ సిబ్బంది సహకారంతో పోలీసులు చేపట్టారు. సూమారు 8 గంటల అనంతరం వరద ఉధృతి తగ్గుముఖం పట్టటంతో రాత్రి 6 గంటల సమయంలో జాతీయ రహదారిపై రాకపోకలకు అనుమతించారు. మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి ఎదుట లొతట్టు ప్రాంతం నుండి వచ్చిన వరద నీరు ప్రవాహం పెరగటంతో రెండు వాహనాలు వరదనీటిలో కొట్టుకుపోయాయి.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు, అధికారులను అప్రమత్తంగా ఉండాలని పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ప్రజలకు అధికారులకు సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పెదకూరపాడు నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గ నాయకులు, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల అవసరం మేరకు సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్తు, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, రహదారులు – భవనాలు తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు తక్షణం స్పందించి, సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి తగిన సహాయక చర్యలు చేపట్టాలని టిడిపి శ్రేణులు, అధికారులకు అదేశాలు ఇచ్చారు. ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. చెరువులు, వాగులు ప్రవహించే ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణించ వద్దని హెచ్చరించారు. భారీ వర్షాలతో నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమను సంప్రదిస్తే అవసరమైన సహాయాన్ని అందించేలా నిబద్ధతతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న భరోసా కల్పించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి.. డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్




**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజక వర్గంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అశోక్ కుమార్ కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలకు గుంటూరు, విజయవాడ ప్రాంతాలంతా జలమయ మయ్యాయి కాబట్టి వాహనదారులను జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. సీజనల్ వ్యాధులతో బాధ పడుతున్న గురజాల నియోజక వర్గ ప్రజలు కొత్త రోగాలు ప్రబలకుండా కాచిన వేడి నీటిని తీసుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.అదే విధంగా పొలాలకు వెళ్ళే రైతులు చెట్ల కింద నిలబడకుండా ఉండాలని, కరెంటు స్థంబాలను తాకొద్దని డాక్టర్ అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి : ఎంపీ



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో వాయుగుండం వల్ల రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో.. ప్రజలు అప్రమత్తంగా, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. వాయు గుండం తీరం దాటేప్పుడు వర్షాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉన్నందున.. కొండ చరియలు విరిగిపడే, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. చెరువులు, నదులు ఎక్కువగా పారే చోట ప్రజలు ప్రయాణం చేయవద్దు. విద్యుత్, నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలి. నాయకులు, కార్యకర్తలు ఈ విపత్కర పరిస్థితిలో ప్రజలకు తోడుగా నిలుస్తూ.. చేతనైన సాయాలు చేయాలని కోరారు. ఎంపీ ఆఫీస్ వైపు నుండి ఏ అవసరం ఉన్న తాను, తన సిబ్బంది అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. నరసరావుపేటలో 9849121352, 91 76609 92306, 83283 06442 హెల్ప్ లైన్ నంబర్లకి సమాచారం ఇవ్వాలని ఎంపి లావు కోరారు.

## పొంగిపొర్లుతున్న ఎద్దు వాగు..



**రాజుపాలెం, మేజర్ న్యూస్ :** రాజుపాలెం మండల పరిధిలోని గణపవరం బలిజపల్లి గ్రామాల మధ్య గల ఎద్దు వాగు భారీగా కురుస్తున్న వర్షాలకు శనివారం పొంగి పొర్లు తుంది. ఈ క్రమంలో భాగంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కూడా వాగు గురించి పట్టించుకోలేదని అసలు ఊసే తేలేదని అలానే గతం లో తెలుగుదేశం పార్టీలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి పనులు కూడా పనులు మొదలుపెట్టి ఆగటం జరిగిందని ఇప్పుడైనా ప్రభుత్వం స్పందించి ఎద్దు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మండలంలో పొంగుతున్న పిల్లేరు వాగు





**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలో పిల్లుట్ల శివారులోని నాగేశ్వర పురం తండా ప్రాంతంలోని పీలేరు వాగు భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది. శుక్రవారం రాత్రి నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. శని వారం ఉదయానికే వాగు పొంగి పొర్లుతున్నాయి. లోలెవల్ మీదుగా నీరు ప్రవహిస్తుంది. దీనితో బెల్లం కొండ మండలం నుండి మాచవరం మండలానికి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగుల వద్ద రెవెన్యూ అధికారులు వీఆర్వో, విఆర్ఎలు, పోలీసులు అప్రమత్త మయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు దినం ప్రకటించారు. జోరు వానలో కూడా అధికారులు ఇంచార్జ్ తాసిల్దార్ క్షమారాణి, ఎస్సై సతీష్ లు తమ సిబ్బందితో పర్యవేక్షణ చేసి, తమ సిబ్బందిని వాగు దగ్గర బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. గ్రామాల్లో సంబధిత అధికారులు వరదను పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఎమ్మార్వో, ఎస్సైలు తెలిపారు. పిన్నెల్లి వాగు, గాంధీనగరం వాగు లు సప్త ట పైకి కొద్దిగా నీరు పారుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆదివారం ఉదయం కల్లా మాచవరం రేగులగడ్డ,వే మవరం తురకపాలెం గ్రామాల నుండి పిడుగురాళ్ల వెళ్ళుటకు గాంధీనగరం దగ్గర వాగు వస్తుందని ప్రజల ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు కావలసిన నిత్యవసర సరుకులు ఏర్పాటు చేసుకుని వర్షాలకు సిద్ధంగా ఉండాలని, ప్రజలు చెప్పుకొనుచున్నారు.

# ఎడతెరిపిలేని వర్షం.. పొంగిపొర్లుతున్న వాగులు





**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు వాగులు పొంగిపొర్లు తున్నాయి. రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సత్తెనపల్లి – నరసరావుపేట ప్రధాన రహదారిలో గోళ్లపాడు, సత్తెనపల్లి–పిడుగురాళ్ల మార్గంలో అనుపాలెం, సత్తెనపల్లి –పెదకూరపాడు రహదారిలో నందిగామ వద్ద వాగులు ఉధృతంగా ప్రవహించి ఈ మార్గంలోని వాహనాల రాకపోకలకు తీవ్రతం కలిగించాయి. శుక్రవారం నుండి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ మయ్యాయి ముప్పాళ్ళ మండలంలో గోళ్ళపాడు ఎస్టి కాలనీ, సత్తెనపల్లి పట్టణంలోని పల లోతట్టు ప్రాంతాలు నీటిమయమయ్యాయి గృహాల్లో ఒక నీరు చేరి ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆయా మండలాల తహసిల్దార్లు అప్రమత్తమై లోకట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నివాసాల్లోకి మీరు చేరిన కుటుంబాలను సురక్షిత ప్రాంతాలను తరలించారు. రూరల్ సీఐలు పోలూరి శ్రీనివాసరావు, రాంబాబులు పొంగిపొర్లుతున్న వాగుల వద్ద రక్షణ చర్యలు తీసుకున్నారు. ఆయా మార్గాల్లోని బస్సులు ఇతర వాహనాలను దారి మళ్ళించారు. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పత్తి వరి నాడు మరులు నీటమునిగాయి.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : కలెక్టర్ అరుణ్ బాబు



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత లేకపోతే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను కూడా తమ బాధ్యతగా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అదేవిధంగా వైద్యాధికారులు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. దీంతోపాటు మున్సిపల్ అధికారులు పట్టణ శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డి ఎం హెచ్ ఓ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలను వాడాలని చెప్పారు. తమ నివాసాల ముందు చెత్తను పడేయవద్దని, దోమల నిల్వకుంటను గుర్తించి వాటిని పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని తెలిపారు. లిసత్తెనపల్లి పట్టణ, పరిసర గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇప్పటివరకు మలేరియా కేసులు నమోదు కాలేదని ఆయన అన్నారు. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించేలా కిందిస్థాయి అధికారులను ఆదేశాలు జారీ చేశామని ఆయన అన్నారు. ప్రభుత్వా సుపత్రిలో రోగులకు ఎటువంటి వైద్య సేవలో ఇబ్బందులు ఎదుర్కాకుండా చర్యలు తీసుకున్నా మన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, కొత్తపేట లను సందర్శించి కమిషనర్ షమ్మీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మురళీకృష్ణ, ఇన్చార్జ్ డిసిహెచ్ఎస్ మంత్రునాయక్, తహసీల్దారు ఫణి, పట్టణ సీఐ బ్రహ్మయ్య, రూరల్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం నందిగామ డొంక రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు వద్ద భద్రతా చర్యలు పరిశీలించారు.

# పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న కొమ్మాలపాటి, మక్కెన



**వినుకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలో జోరుగా వాన కురుస్తున్నప్పటికీ శనివారం తెల్లవారుజాము నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. పట్టణంలో మునిసిపల్, సచివాలయ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనల మేరకు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని మూడవ వార్డు ఇందిరానగర్‌లో ఆయన సచివాలయ ఉద్యోగులతో కలిసి జోరు వానను సైతం లెక్కచేయ కుండా గొడుగులు వేసుకొని ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోగ్యం బాగోలేక తనను పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించడంతో హాజరు కావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈనెల 31 నే పెన్షన్ల పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పండుగ వచ్చిందని, ఒకప్పుడు వైసిపి ప్రభుత్వం నెల వచ్చి రోజులు గడుస్తున్నా పంపిణీ చేసే పరిస్థితి ఉండేది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, ఎన్. శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు రాపర్ల జగ్గారావు, పీవీ సురేష్ బాబు, పువ్వాడ కృష్ణ,భతుల బాలరాజు, సాంబశివరావు,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెదకూరపాడు మండలంలో పొంగుతున్న వాగులు





**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పెదకూరపాడు మండల ప్రాంతంలోని గ్రామాలలో శుక్రవారం రాత్రి నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. శనివారం ఉదయానికే వాగులు పొంగి పొర్లుతున్నాయి. బలుసుపాడు-పరస, కంభంపాడు - పరస, 75త్యాళ్లూరు, పెదకూరపాడు ప్రధాన రహదారుల్లో లోలెవెల్ బ్రిడ్జిల మీదుగా నీరు ప్రవహిస్తుంది. దీనితో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.వాగుల వద్ద రెవెన్యూ అధికారులు వీఆర్వో, విఆర్ఎలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల లకు సెలవు దినంప్రకటించారు. పాలవాహనాలు కూడా వెళ్ళలేని పరిస్థితుల్లో పాలసేకరణ నిలిపివేశారు. జోరు వానలో కూడా అధికారులు, లబ్దిదారుల ఇంటివద్దకే వచ్చి ప్రభుత్వ ఫించన్లు అందిస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తం గా ఉండి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నారు. 75త్యాళ్లూరు చెరువులు పూర్తిస్థాయిలో నుండి ప్రమాదస్థాయిలో ఉన్నాయి. జామలకుంట చెరువు గట్టు మీదుగా పొర్లుతుంది. గ్రామాల్లో సంబధిత అధికారులు వరదను పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఎమ్మార్వో తెలిపారు. ముఖ్యంగా పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# భారీ వర్షాలతో జలమయమైన పొలాలు, రోడ్లు





**ఈపూరు మేజర్ న్యూస్ :** అల్పపీడనం కారణంగా శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో జనజీవనం ఒక్కసారిగా స్తంభించింది.పంట పొలాలు నీట మునిగాయి వర్షపు నీరు రోడ్లపై వాగులుగా ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాల్లోని ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలో వర్షపు నీరు గృహాల్లోకి చేరింది.భారీ వర్షాల కారణంగా రైతులు పొలం పనులు చేసుకునేందుకు ఆటంకం ఏర్పడింది.వానల వల్ల రైతులకు కొంత మేలు జరిగినప్పటికీ అధిక వర్షపాతం వలన అక్కడక్కడ వేసిన వరి, మిర్చి తదితర పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. భారీ వర్షానికి కొచ్చర్ల, అంగులూరు, వనికుంట గ్రామాలలో రోడ్లపై వర్షపు నీరు రోడ్లపై చేరడంతో ఆర్ అండ్ బి రోడ్లువాగులను తలపిస్తున్నది. చెరువులు, వాగులలో ప్రమాదకర స్థాయిలో వర్షపు నీరు చేరడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామాలలో పారిశుధ్యం సక్రమంగా లేనందున కాలవలలో నీరు పేరుకు పోతుంది. అంటువ్యాధులు ప్రబలుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు ధైర్యం చెప్పవలసిన అధికారులు పట్టణాల్లో నివాసం ఉంటూ అందుబాటులో లేకుండా పోయారని ప్రజలు వాపోతున్నారు.

# శావల్యాపురం పోలీస్ స్టేషన్‌ను విజిట్ చేసిన పల్నాడు జిల్లా ఎస్పీ



**శావల్యాపురం, మేజర్ న్యూస్ :** సాధారణ తనిఖీల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శావల్యాపురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా స్టేషన్ నిర్వహణ,సిబ్బంది పనితీరు,విధులు,ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ,వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మహిళా ఫిర్యాది దారులకు వెయిటింగ్ రూమ్ వుండాలని, పెండింగ్‌లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చెయ్యాలనీ సూచించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలనీ, డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహించాలని, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలనీ తద్వారా రోడ్డు యాక్సిడెంట్లను తగ్గించాలని సూచించారు. హత్యలు, హత్యా యత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్‌పిసి తదితర కేసుల రికార్డ్స్ ను పరిశీలించారు.పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు,కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా టీమ్స్ ఫామ్ చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలక్షన్ సమయంలో నమోదైన కేసులను సమీక్షించి వాటిలో అరెస్టులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా పోలీసు స్టేషన్ పరిధిలో గల స్కూల్స్, కాలేజీల, హాస్టల్స్ వద్ద నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.అదే విధంగా రాత్రి,పగలు బీట్ల పని తీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు.అదే విధంగా రౌడీ షీటర్ల కదలికలు,కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల అడ్డుకట్టకు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

# రోజంతా వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

**రెంటచింతల, మేజర్ న్యూస్ :** అల్పపీడన ప్రభావంతో రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో మండల వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. రాత్రి,పగలు తేడా లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది.కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వర్షం కురుస్తుండడంతో జనం అవస్థల పాలయ్యారు. అత్యవసర పనులపై బయటకు వచ్చినవారు గొడుగులు ధరించి బయటకు వచ్చి పనులు చక్కబెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు,తోపుడు బండ్ల వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి.డ్రెయినేజీలలో వర్షపు నీరు పొంగిపొర్లుతోంది. మండలంలోని పాల్వాయి, పశర్లపాడు గ్రామ సమీప వాగులు ఉధృతంగా ప్రవహిస్తోండటంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు స్తంభించాయి. రెంటచింతల సమీపంలోని గోలి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై రాకపోకలు చాలావరకు తగ్గాయి. నీటి ఉధృతికి వాగులో కొట్టుకుపోకుండా స్థానిక పోలీసులు సహాయక రక్షణ చర్యలు చేపట్టారు. కాగా వర్షంతో వర్షాధారిత పంటలకు ఎంతో ఊరట లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## జోరు వానలోనూ ఆగని పెన్షన్ల పంపిణీ - ఎమ్మెల్యే ప్రవీణ్



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో సెప్టెంబర్ 1వ తేదీన అందించాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం కావడంతో శనివారమే పంపిణీ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో జోరు వానను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని గ్రామాల్లో నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ నిర్వహించటం కూటమి ప్రభుత్వ నిబద్దతకు నిదర్శనమని నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రవీణ్ అమరావతి మండల పరిధిలోని చావపాడు గ్రామంలో లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవితో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ బియ్యంపిచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను1వ తేదీ దాటకుండానే అందించటం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగిస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కల్లుగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెదేపా నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట - మాదిపాడుకు నిలిచిన రాకపోకలు



**క్రోసూరు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన అచ్చంపేట ప్రధాన రహదారిపై రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాలుగు అడుగుల మేర వరద ప్రవహిస్తుంది. దీంతో అచ్చంపేట నుండి మాదిపాడుకు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మాదిపాడు నుండి అచ్చంపేటకు వెళుతున్న ఆర్టీసి బస్సు వరద నీటిలో చిక్కుకు పోయింది ఈ నేపథ్యంలో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు బస్సులో ఉన్న వారిని స్థానిక ప్రజలు క్షేమంగా బయటికి తరలించారు.

## జోరు వర్షంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒకటవ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పిడుగురాళ్ల పట్టణంలో తెల్లవారుజాము నుండి ఎడతెరుపు లేకుండా వర్షం పడుతున్న పింఛన్ల పంపిణి కార్యక్రమాన్ని కురియాల ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభించారు. కుండపోతగా వర్షం పడుతున్నప్పటికి పింఛన్లను టీడీపీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది కలిసి 24వ వార్డులో పంపిణి చేసి అవ్వతాతల ముఖలలో ఆనందాన్ని చూశారు. దాదాపు శనివారం పింఛన్లు అందరికి అందేలా కృషి చేస్తామని ఎవరైనా అందుబాటులో లేని వారికి సోమవారం పింఛన్లను పంపిణి చేస్తామని టిడిపి నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి తాళ్ల వాసు (శ్రీనివాసరావు) స్పష్టం చేశారు.

## మల్లెడ వాగుపై రాకపోకల నిషేధం



**వినుకొండ, మేజర్ న్యూస్:** గతంలో భారీ వర్షాల కారణంగా వాగు పొంగి తుఫాను కొట్టుకుపోయి ఘటనలో 11 మందిని బలిగొన్న మల్లెడ వాగుపై రాకపోకలను నిషేధం విధించినట్లు పట్టణ సీఐ శోభన్ బాబు తెలిపారు. మల్లెడు వాగును పరిశీలించిన ఆయన భారీ వర్షాలకు వాగులు పొంగుతున్న నేపథ్యంలో మల్లెడ వాగుపై నిర్విరామంగా నీరు ప్రవహిస్తూ ఉండటంతో వాగు ప్రవాహం తగ్గేంతవరకు ద్విచక్ర వాహనాలు రాకపోకలు ఆపేసినట్లు ఆయన సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు దీనిపై పలు చర్యలు చేపట్టడంతో పాటు పొంగిపొర్లుతున్న వాగుల ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిచే పికెట్ నిర్వహిస్తూ చర్యలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వర్షాలు విరివిగా కురుస్తున్న నేపథ్యంలో చట్టాలపై రాకపోకలు సాధించవద్దని సూచించిన ఆయన పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వాగులు పొల్లుపొందుతున్నాయి. నిర్విరామంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వినుకొండ పట్టణంతోపాటు అన్ని గ్రామాలు జలమయం. వర్షాలు తగ్గేంతవరకు ప్రజలు ప్రమాదంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదేమైనా ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించి రాకపోకలకు ఎటువంటి అవాంతరయాలు జరగకుండా మరో తుఫాను ఘటన వంటివిల్లు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## జోరు వానలో పింఛన్లు పంపిణి



కారంపూడి, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కారంపూడిలో ఒక వైపు జోరుగా వర్షం పడుతున్న పింఛన్ల పంపిణి కార్యక్రమాన్ని ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభించారు కారంపూడి పంచాయతీ కార్యదర్శి కాసిన్య నాయక్. ఎడతెరపి లేకుండా జోరుగా వర్షం పడుతున్నప్పటికి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్లు పంపిణి చేసి అవ్వతాతల ముఖలలో ఆనందాన్ని చూడాలనే ఉద్దేశంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. దాదాపు ఈరోజు అందరికి అందేలా కృషి చేస్తామని ఎవరైనా అందుబాటులో లేని యెడల వారికీ సోమవారం పంపిణి చేస్తామని పంచాయతీ కార్యదర్శి కాసిన్య నాయక్ తెలిపారు.

## రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి : కామిశెట్టి



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని సెప్టెంబర్ 1వ తేదీన పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ పట్టణంలోని "కె కన్వెన్షన్" హాల్లో జనసేన పార్టీ పిడుగురాళ్ళ మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని జన సైనికులు, మెగా అభిమానులు, అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు హాజరు అవుతారని తెలిపారు.

## మినీ గోకులాలకు సబ్సిడీపై రుణాలు



**వినుకొండ, మేజర్ న్యూస్ :** రేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్నచిన్న కారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. పశుపోషణ చేసుకునే రైతులకు ప్రభు త్వం మినీగోకులం పథకం ద్వారా షెడ్లను నిర్మించుకోవడానికి సబ్సిడీ రుణాలు అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సన్న, చిన్న,పేద రైతులు తాము పెంచుకుంటున్న పాడి పశువులకు సరైన వసతి కల్పించలేకపోతున్నారని, దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తోంది. రెండు పశువులకు రూ.లక్షన్నర, నాలుగు ఉన్న వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షలు యూనిట్‌కు మంజూరు చేస్తోంది. యూనిట్ ఖర్చు మొత్తంలో 10శాతం రైతులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మిగిలిన సొమ్మును ఉపాధి హామీ పథకం ద్వారా విడుదల చేస్తోంది. రేషన్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్నచిన్న కారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చు. షెడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలి. గ్రామాల్లో పశువైద్యాధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## ఎలాంటి సమస్యలు తలెత్తినా సహాయాన్ని అందిస్తా

### టిడిపి సీనియర్ నాయకులు అజిత్ సింగ్



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** భారీ వర్షాల నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండలని తెలుగుదేశం పార్టీ నాయకులు అజిత్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల అవసరం మేరకు సహాయ సహకారాలు అందించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్తు, గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, రహదారులు భవనాలు తదితర శాఖల అధికారులు లకు ఫోన్లో ద్వారా సమస్యలను తెలియపరచగలరని ఆయన తెలిపారు ప్రజల విజ్ఞప్తి మేరకు అధికారులు కూడా తక్షణం స్పందించి, సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. భారీ వర్షాలతో నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమను సంప్రదిస్తే అవసరమైన సహాయాన్ని అందించేలా నిబద్ధతతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న భరోసా కల్పించారు అజిత్ సింగ్.

# ఎడతెరిపి లేని వర్షం.. ఇక్కట్లు పడ్డ ప్రజలు





**క్రోసూరు, మేజర్ న్యూస్ :** అల్పపీడన ప్రభావంతో శనివారం ఉదయం నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో మండల వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. తెరిపియకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇంటికే పరిమితమైయ్యారు. అత్యవసర పనులపై బయటకు వచ్చి త్వరితగతిన ఇంటిముఖం పట్టారు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. డ్రెయినేజీలలో వర్షపు నీరు పొంగిపొర్లుతోంది. మండలంలోని ఉయ్యందన, అందుకూరు, ఊటుకూరు, బయ్యవరం, గుడిపాడు గ్రామ సమీప వాగులు ఉధృతంగా ప్రవహిస్తోండటంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు స్తంభించాయి. నీటి ఉధృతికి వాగులో కొట్టుకుపోకుండా స్థానిక పోలీసులు సహాయక రక్షణ చర్యలు చేపట్టారు. గ్రామాలలో అధ్వాన పారి శుధ్యం నెలకొంది. పలు గ్రామాలలోని అంతర్గత రహదారులు చిత్తడి చిత్తడిగా మారి బురదమ యంగా మారాయి. వర్షంతో లోతట్టు పొలాలు నీటమునిగాయి. వాగుల పక్కనున్న మిర్చి, పత్తి, వరి పొలాలు పూర్తిగా నీటమునిగి తాటకాలను తలపించాయి. కాగా వర్షంతో వర్షాధారిత పంటలకు ఎంతో ఊరట లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జగన్ పాలనతో జాతీయ స్థాయిలో దిగజారిన రాష్ట్ర పరువు

**ముంబాయినటిపై వేదింపులపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి**

**జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి**




**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** అరాచకాలు, అవినీతి, అక్రమాలతో సాగిన జగన్ పాలనతో రాష్ట్ర పరువు జాతీయ స్థాయిలో దిగజారిపోయిందని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి ఆరోపించారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ అప్పటి సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సలహాదారుడి పర్యవేక్షణలో సాక్షాత్తూ ఐపీఎస్ అధికారులే తనను అక్రమంగా, అనైతికంగా చిత్రహింసలకు గురిచేశారని బాధితురాలు ముంబై నటి కాదంబరి జెత్వానీ ఆరోపిస్తోందన్నారు. నాటి ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు కలసి తన సొంత మనుషులను కాపాడుకోవడం కోసం ఓ మహిళను బలి చేశారని మండి పడ్డారు. మహిళలకు జరిగిన అన్యాయాన్ని బాధ్యత గల మీడియా ప్రజల్లోకి తీసుకెళితే ఎల్లో రాతలంటూ గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు.

**ముంబాయినటిపై వేదింపులపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి**

పోలీస్ వ్యవస్థ గౌరవానికే మచ్చ తెచ్చే విధంగా ఉన్న ఆరోపణల్లో వాస్తవాలు నిర్ధారణ అయితే బాధ్యులు ఏస్థాయి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని బాలాజి కోరారు. . మిత్రుడు సజ్జన్ జిందాల్‌కు సహాయ పడేందుకు నాటి జగన్ సర్కారు ఆడించిన డ్రామాలో అసలు విషయం బట్టబయలైందని, . ఎక్కడో ముంబైలో వైద్యురాలు, సినిమాల్లో నటించే జత్వానీ ఎన్టీఆర్ జిల్లాఇబ్రహీంపట్నం సమీపంలో వైసీపీ నేత కు భూముల్ని దౌర్జన్యంగా తన పేరిట రాయించుకున్నారని అల్లిన కథ పూర్తి కట్టుకథగా తేల్చారన్నారు. . నాడు వైసీపీ పెద్దలు వేసిన స్కెచ్‌ను నిజమని నిరూపించేందుకు పోలీసుఅధికారులు అత్యుత్సాహం చూపారని, ఎస్పీ స్థాయి అధికారి ముంబై వెళ్లి ఓ మహిళపై ప్రతాపం చూపారని తెలిందన్నారు. సజ్జన్ జిందాల్‌ను రేప్ కేసు నుంచి రక్షించడం కోసం జత్వానీ కుటుంబాన్ని వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. ఒక రాష్ట్ర ప్రభుత్వం మహిళతో వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అనే ప్రశ్నకు నాటి వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు సమాధానంచెప్పాలని బాలాజి డిమాండ్ చేశారు.

## వెల్లటూరులో పింఛన్ల పంపిణీ



**బొల్లాపల్లి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరులో పంపిణీ చేసినట్లు టిడిపి నాయకులు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని పింఛన్లు పంపిణీ నీ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే 31వ తేదీ వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు గారు 2024 ఎలక్షన్లో ముందు నేను గెలిస్తే వికలాంగులకు 6000 వృద్ధులకు వితంతువులకు 4000 పెంచుతానని చెప్పిన మాట మీద నిలబడి ఇస్తున్నారు అని అన్నాడు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సచివాలయం సిబ్బంది డాని, మేడేపల్లి పెద్ద దావీదు, మేడేపల్లి సుబ్బారావు, మేడేపల్లి శేషయ్య, మేడపల్లి నాగేశ్వరరావు, రెడ్డిబోయిన ప్రభుదాసు, మేడేపల్లి చందర్రావు, మేడపల్లి సింహాద్రి, మేడేపల్లి మరియబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లపై దుష్ప్రచారం చేసిన ప్రతిపక్ష పార్టీ తల ఎక్కడ పెట్టుకుంటారు : ఎమ్మెల్యే



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** కూటమి గెలిస్తే సంక్షేమం ఆగిపోతుంది, పెన్షన్లు రావంటూ తప్పుడు ప్రచారం చేసిన బ్లూ బ్యాచ్ వాళ్ళంతా ఇప్పుడు తలలు ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. అన్నమాట ప్రకారమే జులై-1 నుంచి రూ.4వేల పింఛను ఠంఛనుగా అందిస్తున్న ప్రభుత్వంపై ఇకనైనా నిందలు మానుకుని క్షమాపణలు చెబుతారా అని నిలదీశారాయన. సెప్టెంబర్-1 ఆదివారం కావడంతో ఆగస్టు 31నే పింఛను అందించమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం, ఆ మేరకు సచివాలయ సిబ్బందితోనే స్వల్పవ్యవధిలో నే పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారాయన. చిలకలూరిపేట 34, 35వ వార్డులతోపాటు గంగన్నపాలెం, గోవిందపురంలో పలువురు లబ్ధిదారు లకు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పంపిణీ చేశారు. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తున్నా లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్ర చరిత్రలో ఒకటో తేదీకి ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ సందర్భంగానే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలానే అర్హత ఉండి పింఛన్ రానివారికి, అర్హత ఉండి కార్డు లేనివారికి త్వరలో సీఎం చంద్రబాబు ప్రకటించే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగి పింఛన్లు రానివారితో పాటు గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన వారు ఉంటే వీలైనంత త్వరలోనే ప్రకటన వస్తుందన్నారు. సీఎం చంద్రబాబు ఏరోజు ప్రకటిస్తే ఆరోజు అర్హత ఉన్నవారితో పాటు మంచాన పడినవారికి కూడా పింఛన్లు మంజూరు చేస్తామన్నారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి.

# సున్నపు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించాలి : పిడిఎం, ఎంసీపీఐ



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** కార్మిక హక్కులను, చట్టాలను హరిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్న పిడుగురాళ్ల సున్నపు బట్టీల యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈరోజు కార్మిక సంఘాల నాయకులు పిడుగురాళ్ల సున్నపు బట్టీల సెంటర్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లైమ్ స్టోన్ సిటీగా పేరుగాంచిన పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల సున్నపు పరిశ్రమల నుండి నిత్యం కొన్ని వందల టన్నుల సున్నం దేశవ్యాప్తం గా ఉన్న పరిశ్రమలకు, పేపర్ మిల్లులకు, చేపల ఎరువు, బ్రిక్ తయారీ కంపెనీలకు, ఎగుమతి చేయబడుతుంది. అలాంటి పేరుగాంచిన సున్నపు పరిశ్రమలో నిత్యం సున్నం తయారీలో రాత్రిం భవళ్ళు వెట్టి చాకిరికి గురవుతూ ప్రమాదపు అంచుల్లో జీవనం కొనసాగిస్తున్నారు కార్మికులకు యాజమాన్యాలు ఎటువంటి రక్షణ చర్యలను, భద్రతను, మౌలిక వసతులను కల్పించకుండా వారిని మృత్యు కుహరం లోనికి నెడుతున్నారు. సున్నపు బట్టీల కార్మికులు ఏళ్ల తరబడి ఎటువంటి గుర్తింపు లేకుండా సున్నపు తయారీకి అవసరమైనటువంటి రాయి,బొగ్గు కొడుతూ రెక్కల ముక్కలు చేసుకున్నా కనీసం మూడు పూటలా తిండికి కూడా సరిపోవడంలేదని కార్మికులు వాపోతున్నారు.బయట ఉపాధి లేక ఎటు పోలేక పూట గడుపుకోవడానికి యాజమాన్యం పెట్టే ఇబ్బందులకు గుండె రాయి చేసుకుని బతుకుతున్నారు మానవత్వం మరిచిన పెట్టుబడిదారులు బలవంతంగా 12 గంటలు వెట్టి చాకిరి చేయించుకొని కేవలం నెలకు 4000 జీతం ఇచ్చి కార్మికుల కష్టాన్ని అత్యంత దారుణంగా దోచుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొద్దు కష్టం చేయించుకొని పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా కార్మికులను మోసం చేసి లాభాలు ఘడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించని ఎడల రాబోవు రోజుల్లో పల్నాడు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కార్మిక సమస్యలను కలెక్టర్ గారి దృష్టికి తీసుకు వెళతామన్నారు. అనంతరం ఎం సిపిఐ జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ మాట్లాడుతూ కనీసం విధుల్లో ఉన్నప్పుడు కార్మికులు అవసరమైన దుస్తులు, షూస్,కళ్ళజోళ్ళు, హెల్మెట్, కొబ్బరి నూనె, బెల్లం ,లాంటి సరుకులు కూడా యాజమాన్యం ఇవ్వడం లేదు అంటే సిగ్గుచేటు, సున్నపు బట్టీలపై సంబంధిత లేబర్ ఆఫీసర్లు ఉన్నతాధికారులు తరచూ సున్నపు పరిశ్రమలు కల్పిస్తున్న భద్రతా ప్రమాణాలను, రక్షణ చర్యలను, తనిఖీ చేస్తూ ఉండాలి కానీ అటువంటివి ఏమీ లేకుండా కార్మికులను మరింత బానిసలుగా మార్చి వారి హక్కులను హరిస్తూ యాజమాన్యాలకు సేవ చేస్తున్నారు. ఇకనైనా సున్నపు పరిశ్రమ కార్మిక సమస్యలపై ప్రభుత్వం దృష్టి సాధించాలి, శ్రమ దోపిడీ బలవంతపు శ్రమను అరికట్టి వారికి అవసరమైన సేఫ్టీ పరికరాలు, పనికి తగిన జీతం, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి, అలాగే పొల్యూషన్ నియంత్రణకై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎం రాష్ట్ర అధ్యక్షులు కే శ్రీనివాసరావు, సెంటర్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోటేశ్వం రావు, తదితరులు పాల్గొన్నారు.

# అవ్వా తాతలకు అండగా సీఎం చంద్రబాబు : యాగంటి మల్లికార్జునరావు



**మాచర్ల, మేజర్ న్యూస్ :** ఇచ్చిన మాటకు కట్టుబడటం సీఎం చంద్రబాబుకే సాధ్యమని ఒక రోజు ముందుగానే అవ్వ తాతలకు పెన్షన్ ను అందించి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ప్రతి నెల 1న అందించాల్సిన పెన్షన్ పంపిణీని ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే జోరున వాన కురుస్తున్నా లెక్కచేయకుండా రూ.2730 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్‌ను చెల్లించటం సంతోషకరమన్నారు. శనివారం యాగంటి మల్లికార్జునరావు విలేకరులతో మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం తెలుగుదేశం పార్టీకే సాధ్య మౌతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రానున్నాయని, ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదిరాయన్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ మాటలను ఎవరూ నమ్మటం లేదన్నారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ, చంద్రబాబు తనదైన శైలిలో సంక్షేమ పథకాలను కూడా ఇచ్చిన గడువుకు ముందుగానే అందించటం గర్వకారణ మన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించి సుమారు 800 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికే దక్కిందన్నారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ నాయకులు, ఉద్యోగులు పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయం 6 గంటలకే అవ్వ తాతలకు పెన్షన్ అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

## జగన్ బాటలోనే చంద్రబాబు : షర్మిల



**అమరావతి, మేజర్ న్యూస్ :** వైద్య, విద్యా సంస్థలకు ఎన్టీఆర్ పేరు తొలగించి మాజీ సీఎం జగన్ ఆనాడు పెద్ద తప్పు చేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే బాటలో నడుస్తున్నారు అంటూ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కూటమి ప్రభుత్వం తీరును ఆమె తప్పుబట్టారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలకు, ఆసుపత్రులకు దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు తొలగించడాన్ని ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. ఎన్టీఆర్ అయినా, వైఎస్ఆర్ అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడిన వాళ్లేనని, పాలనలో తమదైన ముద్ర వేశారని షర్మిల గుర్తు చేశారు. వారిని రాజకీయాలకు అతీతంగానే చూడాలి తప్పితే నీచ రాజకీయాలు ఆపాదించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వైఎస్ఆర్ తీసుకువచ్చిన ఫీజు రీయింబర్స్ మెంట్, రుణమాఫీ, ఉచిత కరెంటు, పెన్షన్లు ఇలా ప్రతీ పథకం దేశానికి ఆదర్శం అని పేర్కొన్నారు. ఆయన ఏదో ఒక్క పార్టీకి సొంతం కాదని స్పష్టం చేశారు. తెలుగు వారి గుండెల్లో వైఎస్ఆర్ స్థానం ఇప్పటికీ పదిలంగా ఉందని వైసీపీ మీద ఉన్న కోపాన్ని ఆయన మీద రుద్దడం సరికాదని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. వైసీపీలో వైఎస్ఆర్ లేదని, అది ఎన్నటికైనా వైవీ, సజ్జల, సాయిరెడ్డి పార్టీనే అని షర్మిల విమర్శించారు.

## అత్యవసరమైతేనే ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావాలి

**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రమాదాల నివారణ పై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా అవసరమయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. విద్యుత్ తీగలు తెగిపడినా, కిందకు జారిన వెంటనే సమీప అధికారులకు సమాచారం అందించాలని, తాకడం, పక్కకు నెట్టడం లాంటి పనులు చేయవద్దని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపైనా అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, అలసత్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భారీ వర్షాలు, తుఫానుల సమయంలో అధికారులు బాధ్యతగా ఉండాలని దానికి అనుగుణంగా పని చేయాలని అన్నారు. శివారు ప్రాంతాల్లో పర్యటించి ఏ ఆపద వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

## చిలకలూరిపేటలోయువకుడి అనుమానాస్పద మృతి



చిలకలూరిపేట, మేజర్ న్యూస్ : చిలకలూరిపేట పట్టణంలోని పెదనందిపాడు రోడ్డు లోని ఈస్ట్ మాలపల్లి సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ గా పనిచేస్తున్న కారసాల వసంతరావు (35)అనే వ్యక్తి శనివారం ఉదయం డ్యూటీకి వచ్చి ఆసుపత్రి గదిలోనే ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే మృతునికి భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు, ఒంటిపై గాయాలు ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానాస్పద మృతిగా అనుమానిస్తున్నారు. ఇది ఎలా ఉంటే మృతుడి బందువులు ఎవరో చంపి ఉరి వేశారని ఆందోళనకు దిగారు.? పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్న అర్బన్ సీఐ రమేష్, ఎస్ఐ చెన్నకేశవ్, పోలీస్ సిబ్బంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈపూరు మండలంలో ఉత్సాంగా సాగిన పెన్షన్లు పంపిణీ



**ఈపూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని అన్నీ గ్రామాలలో జోరుగా వాన కురుస్తున్నప్పటికీ శనివారం తెల్లవారుజాము నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. అన్ని గ్రామాల్లో అధికారులు, నాయకులతో కలిసి అవ్వ తాతలకు పెన్షన్లు ఉత్సాహంగా పంపిణీ చేశారు. మండలం మొత్తం మీద శనివారం ఒక్క రోజులోనే 90 శాతం పెన్సిల్ పంపిణీ జరిగిందని ఎంపీడీవోఏం రంగనాయకులు తెలిపారు.ఆయన కొండ్రముట్ల, అంగుళూరు గ్రామాల్లో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పండుగ వచ్చిందని, ఒకప్పుడు వైసిపి ప్రభుత్వం నెల వచ్చి రోజులు గడుస్తున్నా పంపిణీ చేసే పరిస్థితి ఉండేది కాదన్నారు. పెన్షన్ల కార్యక్రమంలో మండల నాయకులు రాపర్ల మురళి,బొల్లా సుబ్బారావు, సైదులు,ప్రసాదు, అయినాల కోటేశ్వరరావు,ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొని పంపిణీ చేశారు.

## నకిలీ కరెన్సీ నోటు కేసులో ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా

**ఈపూరు, మేజర్ న్యూస్ :** వనికొండ నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి కేసులో రొంపిచర్ల మండలానికి చెందిన చిరంజీవికి యావజ్జీవ కారాగార శిక్ష విధించటం జరిగింది.ఈపూరు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం నకిలీ కరెన్సీ నోటు కేసులో ముద్దాయికి మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష,2500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు తెలిపారు. 2019వ సంవత్సరం ఆగస్టు 24 తేదీన మండలంలోని వనికుంట గ్రామంలో కూల్ డ్రింక్ షాప్ లో ముగ్గురు యువకులు కూల్ డ్రింక్ తీసుకొని రూ 500 రూపాయలు నోటు ఇచ్చారు.షాపు యజమాని కాశీ మల్ల నాగరాజు నోటును పరిశీలించి నకిలీ నోటుగా గుర్తించి యువకులను ప్రశ్నించగా యువకులు ఏమి మాట్లాడకుండా పారిపోయారు. వెంటనే సదరు షాప్ యజమాని నాగరాజు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి వినుకొండ సిఐ ఎంవి సుబ్బారావు కేసు దర్యాప్తు చేసి రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన వర్ల చిరంజీవిని అరెస్టు చేసి కోర్టుకు పంపారు. కోర్టులో నేరం రుజువు కావడం వలన నరసరావుపేట ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఏ పూర్ణిమ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత భాను వాదనలు వినిపించారు.

## మండలంలో జోరు వానలోనూ ఆగని పెన్షన్ల పంపిణీ



**మాచవరం, మేజర్ న్యూస్:** మాచవరం మండలంలో సెప్టెంబర్ 1వ తేదీన అందించాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం కావడంతో శనివారమే పంపిణీ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో జోరు వానను సైతం లెక్కచేయకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ, ఇతర సిబ్బందితో నాయకులు కలిసి పెన్షన్ పంపిణీ నిర్వహించటం జరిగింది. ఇన్చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఈ ఓ ఆర్ డి డి వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 2న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**మెగా రక్త దాన శిబిరం - వీర మహిళ ఉషారాణి పిలుపు**




వినుకొండ, మేజర్ న్యూస్ : రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఈనెల 2వ తేదీ సోమవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగనున్నాయని వీర మహిళ ఉషారాణి తెలిపారు. జనసేనాని పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని మెగా రక్త దాన శిభిరం నిర్వహించడం జరుగుతుందని, నిశ్శంకరరావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే వేడుకలు, రక్త దాన శిభిరంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉషారాణి పిలుపునిచ్చారు.

## ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి నాదెండ్ల



**తెనాలి టౌన్ న్యూస్:** భారీ వర్షాలతో ముంపునకు గురైన పలు ప్రాంతాలను. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శనివారం సాయంత్రం పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన రహదారి బోసురోడ్డు, మరియు శివారు కాలనీలను పరిశీలించి. పురపాలక సిబ్బందికి తగు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాలలోని మురుగునీరు త్వరగా బయటకు వెళ్లే విధంగా తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న, శానిటరీ ఇన్స్పెక్టర్, పురపాలక సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## వర్షం లోను సామాజిక ఫించన్ పంపిణీ



**మేడికొండూరు మేజర్ న్యూస్:** మేడికొం దూరు మండలం పేరేచర్ల గ్రామం లో ఎన్టీఆర్ భరోసా పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెంచిన సామాజిక ఫించన్ లను సెప్టెంబర్ నెలకు గాను ఒకటవ తేది ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగా అనగా శనివారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది పంపిణీ కార్యక్రమంల చేపట్టారు. వేకువ నుండే జోరున వర్షం పడుతున్నప్పటికీ సచివాలయం సిబ్బంది సకాలంలో ఇంటివద్దే ఫించన్ డబ్బులు అందించడం తో లబ్ధిదారులు సచివాలయం సిబ్బంది ని అభినందించారు.

## నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు**



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గురజాల నియోజక వర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కోరారు. వర్ష ప్రభావం తగ్గేంత వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైన మేరకే బయటకు వెళ్ళాలని, పిల్లలు వర్షంలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భారీగా ప్రవాహించే నదులు గానీ, నీటి ప్రవాహాన్ని గానీ దాటొద్దని, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాలకు ఎక్కడా రైతాంగం ఇబ్బంది పడకుండా, సామాన్యులు ఇబ్బంది పడకుండా ఎక్కడికక్కడ పోలీసు, రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది అలర్ట్ గా ఉండి ఇవన్నీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. త్రాగునీరు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని, వర్ష ప్రభావం కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున డ్రైనేజీ, వర్షం నీరు వెళ్లే విధంగా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ సహకరించాలని , కూటమి నాయకులు అన్నివేళలా అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఏ అవసరం వచ్చినా అండదండలుగా ఉండాలని అన్నారు. ఎక్కడ ఏ ఆపద వచ్చినా పార్టీ కార్యాలయానికి సమాచారం అందిస్తే సహాయక చర్యల్లో పాల్గొంటామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలియజేశారు.

## తుఫాను నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

- **అన్ని రకాల పరీక్షలను వాయిదా వేయాలి**
- **శిథిలావస్థకు చేరిన గవర్నమెంట్ హాస్టళ్లకు పునరావాసం కల్పించండి**
- **పల్నాడు జిల్లా విద్యా అధికారులకు ఎస్ ఎఫ్ ఐ పల్నాడు జిల్లా కమిటీ లేఖ**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో :** రాష్ట్ర వ్యాప్తంగా తుఫాను కారణంగా తీవ్రమైన వర్షాలు కురుస్తున్నాయని ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రమాదాలు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా సెలవు ప్రకటించి, ప్రస్తుతం జరుగుతున్న జిఎన్ఎమ్, ఐటిఐ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు వెంటనే ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో భవనాలు శిథిలావస్థకు చేరి ఉన్నాయి వాటిని వెంటనే ఖాళీ చేసి పరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత జిల్లా అధికారులు, పాలకులు తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీతో లబ్ధిదారులు ఆనందం: సిహెచ్ నరసింహారావు



**మాచవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన మాచవరం ఆర్యవైశ్య కళ్యాణమండపం బజార్లో సచివాలయం సిబ్బంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. వర్షంలో కూడా ఇంటింటికి తిరుగుతూ సచివాలయం సిబ్బంది ఈ పెన్షన్లు పంపిణీ చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా హర్షం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బందికి తోడుగా టిడిపి నాయకులు వారి వెంట ఉండి ఇంటింటికి తిరుగుతూ పెన్షన్ పంపిణీ చేశారు మొత్తం మాచవరం మండలంలో 85% పెన్షన్లు పంపిణీ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య నాయకులు చిటిప్రోలు నరసింహారావు మాట్లాడుతూ కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సెప్టెంబర్ నెల పెన్షన్ ఒకరోజు ముందుగానే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయడం హర్షనీయం అని ఆయన అన్నారు. పెన్షన్ పంపిణీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఆయన అన్నారు. టిడిపి నాయకులు మరియు ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చు సురేష్, తెల్లాకుల సైదారావు , ఊటుకూరి సత్యనారాయణ గుండా వెంకటేశ్వర్లు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ - న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య అవగాహన ఒప్పందం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ - హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల(ఎన్ఏపీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన రంగాలలో ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించ డానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు మరియు ఇండస్ట్రీ - అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ఎన్ఏపీఎల్ ఉద్యోగుల కోసం ఎంటెక్ కోర్సును ప్రత్యేకంగా రూపొందించి వారిలో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యా అర్హతలను పెంచుతామన్నారు.



అంతేకాకుండా నిర్దిష్ట పరిశ్రమ అవసరాలను తీర్చడంతో పాటు విద్యా అనుభవాన్ని పెంచుకోవడానికి ఏరోస్పేస్ టెక్నాలజీస్‌లో న్యూకాన్ టైలర్డ్ మైనర్/హానర్/మాడ్యులర్ ప్రోగ్రామ్‌లను పరిచయం చేస్తామన్నారు. వీటితో పాటు న్యూకాన్ ఉద్యోగులకు పీహెచ్‌డీలో ప్రవేశంకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎన్ఏపీఎల్ హెచ్ఆర్ విభాగాధిపతి అరవింద్ కుమార్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపట్ల జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

- **జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**
- **నోడల్ అధికారులు 3 రోజులూ మండలాల్లో ఉండాలి**
- **జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించిన కలెక్టర్ పి అరుణ్ బాబు**
- **జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెం. 08647252999, 9154959292**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి అన్ని రకాల ముందు జాగ్రత్తలనూ తీసుకోవాలని కలెక్టర్ పి. అరుణ్ బాబు శనివారం అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డిఓలు, తాశిల్దార్లతో తన ఛాంబర్ నుంచి శనివారం ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. అల్పపీడనం రాత్రి తీరం దాటుతుందని, ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ చెప్పారు. ఈ వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారులు ఈ మూడు రోజులపాటు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. జిల్లా స్థాయితోపాటు, డివిజన్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయితీరాజ్, నీటి పారుదల, వైద్యారోగ్యశాఖ, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన, గృహనిర్మాణ శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాల్వలు కల్వర్టులవద్ద ఈ మూడు రోజులూ కాపలా ఉంచాలని, నీరు పారే సమయంలో వాటిపై నుంచి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేసేముందు రెవెన్యూ అధికారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డిపిఓకు సూచించారు. ఆసుపత్రుల్లో మందులు, అవసరమైన సామగ్రి సిద్దంగా ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ మూడు రోజులూ గ్రామాల్లోనే ఉండాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. విద్యుత్ స్తంబాలు నేలకూలడం, వైర్లు తెగిపడటం కారణంగా ఎక్కడా ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎపిఈపిడిసిఎల్ అధికారులకు సూచించారు. పంట పొలాల్లో నీరు నిలిచిఉండకుండా చూడాలన్నారు. ఆర్డిఓలకు మరిన్ని సూచనలు చేశారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ (నెం.08647252999), 9154959292 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చెట్లు నరకటాన్ని నేరంగా, పాపంగా పరిగణించాలి



- **యువత గ్రీన్ హీరోలుగా మారి పచ్చదనాన్ని పెంచాలి**
- **పర్యావరణ సమతుల్యత కోసం చెట్లను విరివిగా నాటాలి**
- **యాభై శాతం పచ్చదనమే లక్ష్యంగా ప్రతీఒక్కరూ కృషి చేయాలి**
- **ఉసిరి...తులసి...వేప...నేరేడు...రావి వంటి దేవతా వృక్షాలకు ప్రాధాన్యం ఇవ్వాలి**
- **చెట్ల పెంపకాన్ని ప్రజలు సామాజిక బాధ్యతగా స్వీకరించాలి**
- **వనం - మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**

**గుంటూరు మేజర్ న్యూస్:** చెట్లను , అడవులను విచక్షణారహితంగా , బాధ్యతారాహిత్యంగా నరకటం వల్లే పర్యవరణంలో ప్రమాదకర మార్పులు చోటు చేసుకుంటున్నాయని , చెట్లు నరకటాన్ని నేరంగా , పాపంగా పరిగణించాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలవారికి అనారోగ్య సమాజాన్ని అందించిన పాపం మనకు తగులుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వనం - మనం కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసరావుతోటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ఏ దేశానికైనా వెన్నుముక యువతేనని , అడవులు , చెట్ల నరికివేతతో పర్యవరణంలో ఏర్పడ్డ సమతుల్యతను కాపాడుకుందుకు యువత నడుం బిగించాలన్నారు. యువత గ్రీన్ హీరోలుగా మారి రాష్ట్రంలో పచ్చదనం పెంపుకై కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 29 శాతం మాత్రమే ఉన్న పచ్చదనాన్ని 50 శాతం పెంచేందుకు విద్యార్థులు , యువత , స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. నాటే చెట్లలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోనో కార్పస్ వంటి ప్రకృతికి , నేలకూ , మనిషి ఆరోగ్యానికి హాని చేసేవాటిని నాటొద్దన్నారు. ఉసిరి , తులసి , వేప , నేరేడు , రావి వంటి దేవతా వృక్షాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెట్లు నాటడం తోనే తమ బాధ్యత అయిపోయిందని భావించకుండా వాటిని సంరక్షిస్తూ భావితరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దామని ఆళ్ళ హరి అభిలాషించారు. బండారు రవీంద్ర , సోమి ఉదయ్ కుమార్ , రామిశెట్టి ధరణి , చింతకాయల వెంకట సాయి , వడ్డే సుబ్బారావు , రఫీ , నరసింహ , స్టూడియో బాలాజీ , హేమంత్ కుమార్ , చలువాది బాలస్వామి , సాయి తదితరులు పాల్గొన్నారు.